ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరెడ్డి

శామీర్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్రస్మా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా తూంకుంటలోని విజ్ఞాన భారతి పాఠశాల కరస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డిని రాష్ట్ర కమిటీ నియమించింది. బుధవారం ట్రస్మా రాష్ట్ర కార్యాలయంలో కమిటీ కార్యనిర్వహణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ట్రస్మా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం హనుమంతరెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు.

పిల్లోనిగూడెంలో 14వ శతాబ్దపు

తెలుగు శాసనం

గ్రామంలో రాష్ట్రకూటుల నాటి విగ్రహాలు

పరిశీలించిన ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): నగర శివార్లలోని శంషాబాద్ మండలం పిల్లోని గూడెం గ్రామ సమీపంలో 14వ శతాబ్దపు తెలుగు అక్షరాలతో రాసిన శిలాశాసనం లభించింది. అలాగే ఇక్కడ స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న నిలువెత్తు వీరగల్లు విగ్రహంతో పాటు మరికొన్ని విగ్రహాలు రాష్ట్ర కూటల కాలానికి(9వ శతాబ్దానికి) చెందినవిగా నిర్ధారించారు. ఈ ఆలయం పక్కనే శిలాశాసనం కనిపించడంతో స్థానికులైన నేషనల్ కల్చర్ ఫౌండేషన్ అధ్యక్షులు పట్నం కృష్ణం రాజు ఈ విషయాన్ని ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివనాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ గ్రామాన్ని సందర్శించిన ఆయన శిలాశాసనంతో పాటు అదే కాలం నాటి శివలింగం నంది విగ్రహాలను కూడా పరిశీలించారు. ఇవి క్రీ.శ 14వ శతాబ్దపు శాసనంగా భావించిన శివనాగిరెడ్డి ఈ విషయాన్ని కేంద్ర పురావస్తుశాఖ శాసన విభాగపు సంచాలకు డాక్టర్ మునిరత్నం రెడ్డికి పంపారు.



శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

శిలాశాసనంలో దానం ఇచ్చినట్లు

మునిరత్నం నాయుడు ఈ శిలాశాసనం రౌద్రనామ సంవత్సరం (క్రీ.శ 1381)నాటిదిగా నిర్ధారించారు. ఓరుగంటి (ఓరుగల్లు) నాగనాయుడు సోదరుడు వినకుడు గూడూరులో (అప్పట్లో ఈ గ్రామం పేరు)ని గణపేశ్వర, దేవర (ఈశ్వర) దేవతలకు ప్రేమతో దానం ఇచ్చినట్లు శిలాశాసనంలో రాసి ఉంది. ఈ శిలాశాసనం కింద నంది చిత్రం కూడా చెక్కారు. అయితే ఏమి దానం చేశారనేది ఇందులో పేర్కొనలేదు. ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్న విగ్రహాలు ఇప్పటికే పూజలు అందుకుంటున్నప్పటికీ ఇవి ఏ కాలం నాటివో ఇప్పటి వరకు తెలియదు. అయితే ఈ 9వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూటముల నాటి విగ్రహాలుగా శివారెడ్డి తెలిపారు. పక్క గ్రామానికి చెందిన వారితో పశుగ్రాసం కోసం జరిగిన సంఘర్షణలో వీర మరణం పొందిన వీరగల్లుతో పాటు ఆ ఘర్షణలో అసువులు బాసిన మరో ఇద్దరి విగ్రహాలు కూడా ఉన్నాయి. రాష్ట్ర కూటుల నాటి కాలానికి చెందిన అనేక ఆనవాళ్లు అనేక ప్రాంతాల్లో బయటపడినప్పటికీ ఇవి చెక్కుచెదరకుండా అద్భుతంగా ఉన్నాయని ఆయన చెప్పారు. హైదరాబాద్ పరిసరాల్లో రాష్ట్ర కూటుల ఆనవాళ్లు లభించడం సంతోషమని ఇంతకుముందు రంగారెడ్డి జిల్లాలో చిల్కూరు, నార్సింగ్‌లలో కూడా రాష్ట్ర కూటుల ఆనవాళ్లు బయటపడ్డాయని తెలిపారు.



14వ శతాబ్దపు శిలాశాసనం

రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు

ప్రజలకు సేవ చేసిన నాయకులకు

ఆదరణ ఉంటుంది

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

7

బోగస్ హామీలతో ముంచారు

మాయమాటలతో ప్రభుత్వం కాలయాపన

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్ పీఎస్‌లో హాజరు

7



సౌర కాంతులు

పీఎం సూర్యఘర్ యోజనతో పల్లెలు జిగేల్

దేశంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ జిల్లా నుంచి మూడు, నాలుగు ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. తర్వాత దశలవారీగా అన్ని గ్రామాలకు విస్తరించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో కోటి ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చి సౌరకాంతులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఆదర్శ గ్రామంలో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను డిస్కమ్‌లకు లబ్ధిదారులు అమ్ముకునే విధంగా పథకాన్ని రూపొందించారు.

ఆదర్శ గ్రామాల్లో 100శాతం సోలార్ విద్యుత్

జిల్లాకు మూడు, నాలుగు గ్రామాల ఎంపిక

రెడ్కో విద్యుత్ సంస్థల ద్వారా సర్వే

దశలవారీగా మిగతా గ్రామాలకు విస్తరణ

కోటి ఇళ్లకు ప్యానెళ్లు అమర్చేలా ప్రణాళిక

6



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): భవిష్యత్తులో పల్లెలకు కరెంట్ కష్టాలు తొలగనున్నాయి. విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకాన్ని దశలవారీగా అన్ని గ్రామాలకు విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు మూడు నుంచి నాలుగు గ్రామాలను ఎంపిక చేయాలని రాష్ట్రాలకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఇప్పటికే సర్వే నిర్వహించి గ్రామాల ఎంపిక కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. రెడ్కో (రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ) విద్యుత్ సంస్థలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సౌర విద్యుత్ అందించనున్నారు. తరువాత దశలవారీగా మిగతా గ్రామాలకు విస్తరిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ ప్యానళ్లు అమర్చి

మిగతా 7వ పేజీలో...



పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మెరుగైన విద్యనందించడమే

ప్రభుత్వ లక్ష్యం

ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో బుధవారం రాత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వ కృత నిశ్చయంతో ఉందని, దానికి తగిన విధంగా చర్యలు చేపడుతున్నట్లు గుర్తు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణించాలన్నారు. విద్యతోనే అన్ని రంగాల్లో దూసుకెళ్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో గొప్పవాళ్లయ్యారని గుర్తుచేశారు. మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వం నేర్పించాలని ఉపాధ్యాయులను కోరారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నేనూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్న : కలెక్టర్ గౌతమ్

ఖమ్మం జిల్లా, కల్లురు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాను చదువుకున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, యశస్వినీరెడ్డి, మకన్‌సింగ్ ఠాకూర్, డీఈవో విజయకుమారి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న రూపురేఖలు!

కొడంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

రూ.690.78 కోట్లు మంజూరు

కొడంగల్, కోస్గి బల్దియాల్లో పనులు ప్రారంభం

జంక్షన్ల విస్తరణకు మరో రూ.150 కోట్లు

హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

కొడంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ సమగ్ర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.690 కోట్లు మంజూరు చేశారు. దీంతో పాటు ప్రధాన చౌరస్తాలైన అంబేడ్కర్, శివాజీ జంక్షన్ల విస్తరణ కోసం రూ.150 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మొదటి విడతగా రూ.600 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులను కోస్గిలో ప్రారంభించారు. దీంతో పాటు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.1,200 కోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నాయి. తాజాగా కొడంగల్, కోస్గి బల్దియాల సమగ్ర అభివృద్ధికి నిధుల మంజూరుతో పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రాజకీయాల్లో బిజీబిజీగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. కొడంగల్ అభివృద్ధి

మిగతా 8వ పేజీలో...



అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ నమూనా



అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టే సుందరీకరణ పనులతో నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీల అభివృద్ధి పట్టాలెక్కింది. కొడంగల్, కోస్గిలోని ప్రధాన చౌరస్తా విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధితో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది.

-తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



క్రీడాకారుల డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట స్పోర్ట్స్ స్కూల్ సందర్శన

శామీర్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులను క్రీడలతో పాటు విద్యలోనూ అత్యుత్తమ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే వారికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ, క్రీడల్లో ప్రపంచస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలన్నారు. బుధవారం తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. తరగతి గదులను, క్రీడల ప్రాక్టీస్ హాళ్లను, గ్రౌండ్స్‌ను, డైనింగ్ హాల్, తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా?, క్రీడాకారులకు కోచ్‌లు సక్రమంగా శిక్షణ ఇస్తున్నారా? అనే విషయాలపై ఆరా తీశారు. ఈ స్కూల్‌లో ప్రస్తుతం 4 నుంచి 12 వ తరగతి వరకు నడుస్తోందని, మొత్తం 430 మంది విద్యార్థులున్నారని స్పెషల్ ఆఫీసర్(ఓఎస్‌డీ) సుధాకర్‌రావు కలెక్టర్‌కు వివరించారు. ఆయనతో పాటు జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు, ఓఎస్‌డీ సుధాకర్‌రావ్, ప్రిన్సిపాల్ ప్రకాశ్, క్రీడల అధికారి గోపాల్‌రావ్‌లకు సూచించారు. క్రీడాకారులను ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని ఈవెంట్లలో, క్రీడల్లో నిరంతరం ప్రోత్సహిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదిగేలా తీర్చిదిద్దాలని సూచించారు.

వాహనాలు బాధ్యతగా నడపాలి : సీపీ సుధీర్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలను నడపాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. అంకుశాపూర్ ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రతామాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే పోలీసులకు సమాచారం అందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్‌నాయక్

రేపు లగచర్లలో భూ సర్వే

దుద్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు రేపు(31న) లగచర్లలో భూ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. బుధవారం రోటిబండతండా, లగచర్ల గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 102, 117, 120, 121 సర్వే నంబర్‌లోని 110 ఎకరాల 32 గుంటల భూమికి సంబంధించిన అసైన్డ్ భూములకు భూ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా సర్వే నంబర్‌లలో పట్టాదారులు తమ హద్దులను చూపించాలని సూచించారు. భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ప్లాటు, ఇందిరమ్మ ఇల్లు, ఇంటికో ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. అయితే రోటిబండ తండాలో కొంత మంది రైతులు ఈ భూములను నమ్ముకొని తరతరాలుగా సాగుచేస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. అలాంటి భూములను ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాబు ఆర్‌ఐ నవీన్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు భరత్‌రెడ్డి, అబ్దుల్ రవూఫ్, సత్యశీలారెడ్డి, రవిగౌడ్, ట్రైనీ ఎస్సైలు రాహుల్, మోహన్, కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

క్వాంటమ్ లైఫ్ యూనివర్సిటీ

గొప్పవరం

ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిత్తరంజన్ దాస్

కోట్‌పల్లి, జనవరి29 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ లైఫ్ యూనివర్సిటీ జిల్లా ప్రజలకు గొప్పవరమని ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి చిత్తరంజన్ దాస్ అన్నారు. బుధవారం నాగ్‌సన్‌పల్లి గ్రామ పరిధిలోని యూనివర్సిటీని ఆయన సతీమణితో కలసి సందర్శించారు. యూనివర్సిటీ నిర్వాహకులు రాజశేఖర్ శ్రీదేవీలు వారికి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ న్యూటన్ కొండవీటి, డాక్టర్ లక్ష్మీ కొండవీటి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు, ఎంతో అద్భుతమన్నారు. అనంతరం పిరామిడ్‌లో ధ్యానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య పవన్, హరిక, నిర్మల, కృష్ణ, వికారాబాద్ జిల్లా కోర్టు ఫీల్డ్ అధికారి కాజామైనోద్దిన్, పోలీస్ అధికారులు ధారూర్ సీఐ రఘురాములు, కోట్ పల్లి ఎస్సై గఫార్, అమర్, సుధాకర్, ఆంజనేయులు, లీలావతి, జ్యోతి పాల్గొన్నారు.

ఉమ్రా యాత్ర విజయవంతం

శంషాబాద్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఉమ్రా యాత్రికులు వర్షంలోనే ప్రార్థనలు చేసినట్లు యాత్రికులు తెలిపారు. జనవరి 15న హైదరాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన 15 మంది తిరిగి బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్కాలో వర్షం కురిసిందని, భారీ వర్షంలోనే ప్రత్యేక ప్రార్థనలు చేశామని తెలిపారు. మక్కాలో వర్షం ఎక్కువగా కురవడంతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రతీ ముస్లిం ఉమ్రా యాత్ర చేయాలని కోరారు. ఈమేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న యాత్రికులకు ఆల్ మీ జాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ జీఎం ఖాన్, మేనేజింగ్ డైరెక్టర్ మొహ్మద్ ఫయాజ్ అలీ ఘన స్వాగతం పలికారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యాత్రికులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడల ప్రారంభోత్సవంలో శ్రీరామ్, జ్యోతి, అంజిరెడ్డి

కందుకూరు/మహేశ్వరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు మార్గాన్ని ఎంచుకోకుండా, విద్య, క్రీడారంగాల్లో రాణించాలని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి కందడి శ్రీరామ్ అన్నారు. ఏబీవీపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఏబీవీపీ టౌన్ జాయింట్ కార్యదర్శి జ్యోతిప్రసాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. మాజీ ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, ఏబీవీపీ విభాగ్ సంఘటన్ మంత్రి పృథ్వీజీ, వీరపట్నం జిల్లా కన్వీనర్ శివకృష్ణ, నగర శాఖ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి డిల్లీ భానుప్రసాద్, నాయకులు, ఏబీవీపీ పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తిగల క్రీడలపై పట్టు సాధించుకోవాలని విశ్రాంత జాయింట్ కలెక్టర్ మూర్తి అన్నారు. ఖేలో భారత్ క్రీడోత్సవ్-2025ను ఏబీవీపీ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల కేంద్రంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడా పోటీల ముగింపుకు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు, విద్యాధికారి కస్నానాయక్, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న మూర్తి

ఫిబ్రవరి 2 నుంచి లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 2నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బుధవారం బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణరావును కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిసి పత్రిక అందించినట్లు తెలిపారు. నాయకులు తుమ్మ నర్సింహ్మా, బోళ్ల యాదగిరి, పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు కేశవులు, పాపయ్య, రాములు, తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

కడ్తాల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు వెంటనే చెల్లించాలని మండలపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. నెల నెలా వేతనాలు సక్రమంగా రాక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని వాపోయారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఏపీవో లలిత, కాలే వెంకటేశ్, కేతావత్ శ్రీను, పి.శ్రీను తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందే

» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

యాచారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తేనే బడుగు బలహీన వర్గాలకు మేలు కలుగుతుందని పలువురు వక్తలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని, కేంద్రం కూడా వర్గీకరణకు కట్టుబడి ఉందని చెప్పారు. బుధవారం యాచారం మండలంలోని నందివనపర్తిలో ఎస్సీ వర్గీకరణ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇడుకుల యాదయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చాలాకాలంగా ఉద్యమాలు చేస్తున్నారని, న్యాయస్థానాలు కూడా వర్గీకరణ చేయాలని సూచించాయన్నారు. వర్గీకరణ కారణంగా నిరుపేదలందరికీ విద్య, ఉద్యోగ రాజకీయపరంగా రిజర్వేషన్లు ఉంటాయని కురుమ సంఘ, యాదవ నాయకులు నర్రె శ్రీశైలం,. ఒంగూరి సాయికుమార్‌లు చెప్పారు. వర్గీకరణ సాధించేవరకు తమ పోరాటం ఆపేదిలేదని ఎమ్మార్పీఎస్ నాయకులు మూలి వెంకటేష్ చెప్పారు. బ్రహ్మణ సంఘ నాయకులు శివ, నాయకులు జంగయ్య, యాదయ్య, రాకేష్, రాందాస్. సుధాకర్ తదితరులున్నారు.

సౌర కాంతులు

(ఐదో పేజీ తరువాయి)

సౌరకాంతులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఆదర్శ గ్రామంలో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను డిస్కమ్‌లకు లబ్ధిదారులు అమ్ముకునే విధంగా పథకాన్ని రూపొందించారు. ఇలా లబ్ధిదారులు డిస్కమ్‌లకు విక్రయించే మిగులు విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.3.20 చొప్పున చెల్లిస్తారు. దీని వల్ల లబ్ధిదారులకు కొంత ఆదాయం కూడా లభించనుంది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికి కూడా ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వం ప్రస్తుతం డిస్కమ్‌ల నుంచి యూనిట్ రూ. 5ల చొప్పున కొనుగోలు చేస్తుంది. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.3.20కే లభ్యం కానుండడంతో ప్రభుత్వానికి కూడా ఆర్థిక భారం తగ్గనుంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కొందరు స్వచ్ఛందంగా సబ్సిడీపై ఈ పథకం కింద సోలార్ ప్యానళ్లు అమర్చుకుంటున్నారు. అయితే ఆదర్శ గ్రామాల్లో మాత్రం 100శాతం పథకాన్ని అమలు చేయనున్నారు. 5వేల జనాభాకు పైబడిన గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. సర్వే ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడతామని అధికారులు తెలిపారు.



పథకం అమలు ఇలా...

ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద ఎంపిక చేసిన గ్రామంలోని వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వీధి దీపాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సోలార్ ప్యానళ్ల విద్యుత్ అందించనున్నారు. గృహాలకు, కార్యాలయాలు, ఇతర వనరులకు రెండు లేదా మూడు కిలో విద్యుత్ వాట్ల ఉత్పత్తి చేసే సోలార్ ప్యానళ్లు అమరుస్తారు. అలాగే వ్యవసాయానికైతే 5 కిలో వాట్లకు పైగా విద్యుత్ ప్యానళ్లు అమరుస్తారు. ఒక్కో కిలో యూనిట్ సోలార్ ఏర్పాటుకు రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. యూనిట్‌కు రూ.30వేల వరకు సబ్సిడీ ఇస్తారు. మూడు కిలో యూనిట్లకు పైగా ఉంటే గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ ఇస్తారు. ఒక్కో కిలో యూనిట్‌కు నెలకు 120 యూనిట్లకుపైగా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గృహ అవసరాలకు ఏర్పాటు చేసే ప్యానళ్ల ద్వారా నెలకు సగటు దాదాపు 300 నుంచి 400 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అలాగే వ్యవసాయ అవసరాలకు ఏర్పాటు చేసే ప్యానళ్ల ద్వారా నెలకు 900 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గృహవసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుకుని మిగతాది అమ్ముకోవచ్చు. అలాగే వ్యవసాయానికి సంబంధించి ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్‌ను కూడా డిస్కమ్‌లకు అమ్ముకుని కొంత ఆదాయం పొందవచ్చు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సదరు సంస్థల ద్వారా నిధులు సమీకరించి సోలార్ ప్యానళ్లు అమర్చనున్నారు.

మొగిలిగిద్ద పాఠశాలకు 150 ఏళ్లు



శత వార్షికోత్సవ శిలాఫలకం

● 1873లో ఉర్దూ పాఠశాలగా ప్రారంభం ● రేపు ప్రత్యేక కార్యక్రమం.. సీఎం రేవంత్‌రెడ్డి రాక

షాద్‌నగర్/ష్యాద్‌నగర్ అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించబోతున్న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాబోతున్నారు. భారీ స్థాయిలో కార్యక్రమం నిర్వహించడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు సన్నాహాలు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1873లో నిజాం ప్రభుత్వ హయాంలో ఎండీ అబ్దుల్ రహీం సిద్దిఖీ అనే ఉపాధ్యాయుడు కొద్దిమంది విద్యార్థులతో మొగిలిగిద్దలో ఉర్దూ మాధ్యమ పాఠశాలను ప్రారంభించారు. అద్దె భవనంలో ప్రారంభమైన ఈ పాఠశాలలో 1886లో లక్ష్మణ్‌రావు అనే ఉపాధ్యాయుడు తెలుగు మాధ్యమాన్ని కూడా ప్రారంభించారు. ప్రస్తుతం తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన సాగుత్యూన్నది. ఈ పాఠశాలలో చదివిన చాలా మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నరుగా పనిచేసిన దివంగత బూర్గుల రామకృష్ణారావు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన బి.సత్యనారాయణరెడ్డి, ప్రజా సమస్యలపై నిరంతర పోర్యాటం చేస్తున్న ప్రొఫెసర్ జి. హరగోపాల్ వంటి ఎందరో ఈ పాఠశాలలో చదివినవారే. ప్రస్తుతం ఇక్కడ 496 మంది విద్యార్థులు చదువుతున్నారు. 34 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం గదుల కొరత ఉంది. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.11.50 కోట్ల వ్యయంతో అన్ని వసతులతో నూతన భవన నిర్మాణానికి అంగీకరించి, శంకుస్థాపన చేయబోతున్నారు. బాలురకు, బాలికలకు వసతి గృహాలు, మినీ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నారు.



మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల


ప్రభుత్వ విద్య బలోపేతం



మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోతుండడంతో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం పెరుగుతుంది. పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఆదర్శంగా అభివృద్ధి చెందుతుంది.

ప్రొఫెసర్ జి. హరగోపాల్

సీఎం రాకతో పాఠశాల అభివృద్ధి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకతో మొగిలిగిద్ద పాఠశాలలో సమస్యలు పరిష్కారమై అభివృద్ధి చెందుతుంది. అన్ని వస్యాతులతో నూతన భవనం, విద్యార్థులకు వసతి గృహాల నిర్మాణం జరుగబోతున్నది. ఒక ప్రభుత్వ పాఠశాలకు సీఎం వచ్చి సమస్యలను పరిష్కరించబోతున్నందుకు ప్రధాన్యోపాధ్యాయుడిగా ఎంతో ఆనందిస్తున్నాను.

ఎస్. జనార్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు



భవనంపై నుంచి దూకే ప్రయత్నం చేస్తున్న విద్యార్థిని

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పరీక్ష ఫెయిల్ అవుతాననే భయంతోనే..!

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పరీక్ష సరిగా రాయకపోవటంతో ఫెయిలవుతానన్న భయంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల భవనం పెకి ఎక్కి దూకి చస్తానంటూ హడలెత్తించింది. అప్రమత్తమైన విద్యార్థులు, సెక్యూరిటీ గార్డులు విద్యార్థినిని పట్టుకొని ఆత్మహత్యాయత్నాన్ని విఫలం చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి బాలికల ఇంజనీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. విద్యార్థులు, సెక్యూరిటీ గార్డుల వివరాల ప్రకారం.. మైసమ్మగూడలోని మల్లారెడ్డి బాలికల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని నాలుగో అంతస్తు పైకి వెళ్లి కిటికి నుంచి కిందకు దూకే ప్రయత్నం చేసింది. గుర్తించిన తోటి విద్యార్థులు అరుపులు కేకలు వేశారు. అప్రమత్తమైన కొందరు విద్యార్థులు వెనుక నుంచి విద్యార్థిని పట్టుకొని సెక్యూరిటీ గార్డుల సాయంతో కిందికి దించారు. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం మౌనంగా ఉంది.

మొగిలిగిద్ద, చించోడ్‌లను మండలాలు చేయాలి

» ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రైవేటు నిధులెందుకు?

» మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మొగిలిగిదద్ద, చించోడ్ గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తన ప్రైవేటు క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మొగిలిగిద్దను మండలం చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నాలు నిర్వహించిందని, ఇప్పుడు ఆ పార్టీ ముఖ్యమంత్రే స్వయంగా మొగిలిగిద్ద గ్రామానికి వస్తున్నందున మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేయాలన్నారు. ఆ రెండు గ్రామాలను మండల కేంద్రంగా ప్రకటిస్తే తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శాలువాలు కప్పి సన్మానం చేయడంతో పాటు రూ.2కోట్ల నిధులు సమకూరుస్తానని తెలిపారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 వార్షికోత్సవానికి సీఎం రావడాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల కట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని, ప్రభుత్వం వద్ద కళాశాల నిర్మాణానికి నిధులు లేవా? అని ప్రశ్నించారు. పరిశ్రమల యజమానులు జూనియర్ కళాశాలకు లక్షలాది రూపాయలు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏంటో చెప్పాలని కోరారు. ఇంతకు దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి ఉందా? ఈ విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలి

» భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌కు బాధిత రైతుల వినతి

ఆమనగల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పచ్చటి పంటపొలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంతో ఉపాధి కోల్పోతామని ఆమనగల్లు మన్సిపాలిటీ సాకిబండ తండా రైతులు జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వంగా వచ్చిన భూములు అన్నదమ్ములం పంచుకున్న తర్వాతే సర్వే చేపట్టాలని కోరారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రాజుకు బుధవారం సాకిబండ తండా, చెన్నంపల్లి రైతులు వినతి పత్రం అందజేశారు. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు ఒక వేళ భూములు తీసుకుంటే ఎకరాకు రూ.2కోట్ల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఫ్యూచర్‌సిటీలో 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనోపాధి కోసం జిల్లాలో ఎక్కడైనా భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని రాజు, తహసీల్దార్ లలితలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజురెడ్డి, యాదిరెడ్డి, పాండు, రాజేందర్, రమేశ్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయాన్ని తుక్కుగూడకు తరలించొద్దు

మహేశ్వరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా మహేశ్వరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంబంధిత సీడీపీవో తన ఇష్టానుసారంగా ఎవరితో సంప్రదించకుండా తుక్కుగూడకు తరలించడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నాయకుడు, మహేశ్వరం మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్‌యాదవ్, బీజేవైఎం నాయకుడు శ్రవణ్ అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని మహేశ్వరం మండల కేంద్రం నుంచి తుక్కుగూడకు తరలించే ప్రయత్నాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ నాయకులు మహేశ్వరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సీడీపీవో శాంతిశ్రీని వివరణ కోరగా మహేశ్వరంలోని ఐసీడీఎస్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందని.. పాములు, తేళ్లు కార్యాలయంలోకి వస్తున్నాయని, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు వివరించామని, కలెక్టర్ అనుమతితోనే కార్యాలయాన్ని తరలించాలనుకున్నామని, ఇందులో ఎవరి స్వార్థమూ లేదని వివరించారు.

రుణమాఫీ పూర్తిగా చేయాలి

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సహకార సంఘాల పరిధిలోని రైతులకు నూటికి నూరుశాతం రుణ మాఫీ చేయాలని కోరుతూ బుధవారం సహకార సంఘాల చైర్మన్లు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. డబీల్‌పూర్ సొసైటీ పరిధిలో 661 మంది అర్హులైన రైతులు ఉండగా 340 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, మేడ్చల్ సొసైటీలో 524 మంది రైతులకు 398కి రుణమాఫీ చేశారని, పూడూరు సహకారం సంఘం పరిధిలో 1400 రైతులకు గాను 1146 మందికి రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని సొసైటీల చైర్మన్లు కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ సహకార సంఘం చైర్మన్ రణదీప్ రెడ్డి, డబీల్‌పూర్ సొసైటీ చైర్మన్ సురేష్ రెడ్డి, పూడూరు సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి డైరెక్టర్లు వెంకటేశ్ యాదవ్, మధుసూధన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

అనురాగ్‌లో ఏఐ హాక్ డేస్-2025 సదస్సు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఏఐ హాక్ డేస్-2025 సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీజేఏకే ఇన్ఫోటెక్ సీఈవో శ్యామ్‌సాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. 156 మంది 52 బృందాలుగా ఏర్పడి ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, క్రియేటివ్ టెక్ డొమైన్లో కృత్రిమ మేధ ఆధారిత ప్రాజెక్టులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ డీన్లు విజయ్‌కుమార్, విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు

వికారాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రానున్న వేసవిలో వినియోగదారులకి నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఈ మేరకు విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పనులు తర్వితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912 సేవలను జీహెచ్‌ఎంసీతో పాటు రూరల్ ఏరియాకు కూడా అందుబాటులోకి తెచ్చారని వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యుత్ అధికారులు లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

ఆమనగల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో అందరూ కలిసి రావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. మాడ్గుల మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని ఇర్విన్ నుంచి కుర్మేడ్ రోడ్డు ఆధునీకరణకు రూ.2.40 కోట్లు, బోరగుండు నుంచి అందుగుల, పల్లెతండా నుంచి అందుగులకు రూ. 3.80 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల మండలంలో పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.10.43 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమేశ్, చందన్ నాయక్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమిస్తున్న వారిపై కేసు

ధారూరు, జనవరి 29: ధారూరు అటవీ రేంజ్‌లోని రాస్నం అడవిలోని చెట్లను, రాళ్లను తొలిగించి, అటవీ హద్దులను చెరిపేసి పొలాలకు రోడ్డు వేసుకున్న వారిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ తెలిపిన ప్రకారం.. అటవీ ప్రాంతంలో రాస్నం గ్రామానికి చెందిన సదానంద రెడ్డి కొనుగోలు చేసిన ఐదెకరాల పొలానికి దారి కోసం చుట్టుపక్కల రైతులను రెచ్చగొట్టి అటవీ భూమిలో నుంచి దారి వేసుకునేందుకు ప్లాన్ చేశాడు. ఈ నెల 26న సెలవు కావటంతో అధికారులంతా గణతంత్ర వేడుకల్లో ఉన్న సమయంలో అదునుచూసి జేసీబీతో అటవీ ప్రాంతంలోని చెట్లను, రాళ్లను తొలిగిస్తుండగా సమాచారం అందుకున్న రేంజర్ రాజేందర్ పనులను నిలిపివేయించాడు. ఆ రోజు పనులను నిలిపివేసిన సదానంద రెడ్డి మరి కొందరితో కలిసి అటవీ హద్దులను చెరిపివేసి రాళ్లను, చెట్లను తొలిగించి పొలానికి దారి చేశాడు. అటవీ భూమిలో నుంచి అక్రమంగా దారి వేసినట్లు ఫిర్యాదు రావటంతో రేంజర్ సిబ్బందితో వెళ్లి విచారణ జరిపి అటవీ ప్రాంతంలో వేసిన దాదాపు 100 మీటర్ల రోడ్డును బుధవారం జేసీబీతో గుంతలు, కందకాలు తవ్వించి రోడ్డును మూసి వేయించారు. నిందితుడు సదానంద రెడ్డితోపాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బోగస్ హామీలతో నట్టేటా ముంచారు

» మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో బోగస్ హామీలిచ్చి ప్రజలను నట్టేటా ముంచిందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. కోర్టు నిబంధనల మేరకు బుధవారం బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో హాజరైన ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. పంట రుణమాఫీ రైతులకు పూర్తి స్థాయిలో కాలేదని, రైతు భరోసా ఏడాదిగా ఎగ్గొట్టి ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతు భరోసా జమచేస్తూ మభ్యపెడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేంతవరకు బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కోట్లయాదగిరి, బాబర్, దేశ్యానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, బండ శ్రీను, తిరుపతయ్య పాల్గొన్నారు.

రాజకీయంలో రిటైర్‌మెంట్ ఉండదు

» ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంలో విరమణ ఉండదని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పదవీ కాలం ముగించుకున్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పాలకవర్గానికి బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు మంచిగా సేవలందించిన నాయకులను ప్రజలు తప్పక ఆదరిస్తారన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడే వారికి తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మట్లాడుతూ.. ప్రజలకు సేవలందించిన నేతలను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారనానరు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న పీవీ.రావు

వార్షికోత్సవానికి రావాలని స్పీకర్‌కు ఆహ్వానం

తాండూరు రూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జినుగుర్తిలోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ సాందీపని గురుకులం పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఫౌండేషన్ అధ్యక్షుడు రాము, మల్లారెడ్డి బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానపత్రికను అందజేశారు.

నేడు కంటివైద్య శిబిరం

కొడంగల్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో గురువారం ఉచితంగా కంటివైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి హరినాథ్ నెహ్రూ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, లయన్స్ క్లబ్ కొడంగల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

బల్దియా పరిధిలోకి.. విలీన గ్రామాలు

పరిగి,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపల్‌లో విలీనమైన పంచాయతీలను బుధవారం బల్దియా పరిధిలోకి తీసుకున్నారు. ఆరు పంచాయతీలను విలీనం చేస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ)డాక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు బుధవారం కమిషనర్ వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఎంఏ కరీం, ఉద్యానవనశాఖ అధికారి వైజయంతి ఉన్నారు.

పేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్

చౌడాపూర్: అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం మక్త వెంకటాపూర్ తండాలో చిన్నబాయికి మంజూరైన రూ.18,500, విస్లావత్ లక్ష్మణ్‌కు రూ.10,500 విలువగల చెక్కులు అందించారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్, నీల్యా, రామారావు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



కంప్యూటర్లు అందజేస్తున్న ఐడీబీఐ ప్రాంతీయ కోఆర్డినేటర్ ప్రియ

శామీర్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడమే ఐడీబీఐ ధ్యేయమని ప్రాంతీయ కోఆర్డినేటర్ ప్రియ అన్నారు. బుధవారం సీఎస్ఆర్‌లో భాగంగా శామీర్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వేణు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాయక్‌కు ఐడీబీఐ శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ గౌతమితో కలిసి కంప్యూటర్లు, తాగునీటి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐడీబీఐ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

తాండూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యతోనే భవిష్యత్ అని బహదూర్‌పూర ఎమ్మెల్యే ఎండీ ముబీన్ అన్నారు. బుధవారం పాత తాండూరులో ఎంఐఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రతి ఏడాది గైడ్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బహదూర్‌పూర్ కార్పొరేటర్ ఎండీ ఖాదర్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు హ ది, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సాజిద్, మజర్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేంతవరకు వెంటాడుతాం

బొంరాస్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు వెంటాడుతామని బీజేపీ మండల అధ్యక్షుడు సీహెచ్ నర్సింహులు అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేటా ముంచిందని ఆరోపించారు. సమావేశంలో ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బాబయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి జగదీశ్‌సాగర్, మండల ప్రధాన కార్యదర్శి ముకుంద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌సాగర్, నరేశ్, ప్రజాపతి, అడివయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

కొనసాగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలు



తాండూరులో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఉత్సవాల సందర్భంగా బుధవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలుంటాయని అన్నారు. సీఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వికారాబాద్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స పాటించాలని ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ అన్నారు. రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లకు మహవీర్ ఆస్పత్రి వైద్య బృందం ఆర్టీవో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మహవీర్ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవాబుపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై అరుణ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మురళి, రవీంద్రచారి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్: మైనార్లకు వాహనాలు ఇవ్వొద్దని బషీరాబాద్ ఎస్ఐ శంకర్ అన్నారు. గొట్టిగఖుర్దు గ్రామంలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు.

మేడ్చల్ టౌన్: రద్దీగా ఉండే రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయొద్దని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని వీధి వ్యాపారస్తులకు ట్రాఫిక్ నిబంధనల అవగాహన కల్పించారు.

పదవికే విరమణ.. ప్రజా సేవకు కాదు



గూడూరు సబిత దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

కీసర రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పదవికే విరమణ ప్రజా సేవకు కాదని నాగారం మున్సిపల్ 7వ వార్డు మాజీ కౌన్సిలర్ గూడూరు సబితాఆంజనేయులుగౌడ్ అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పదవి కాలం ముగియడంతో బుధవారం బ్రహ్మయ్య కాలనీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ కౌన్సిలర్‌గా అవకాశం కల్పించినందుకు కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. 2వ వార్డు కౌన్సిలర్ ఎలిజాల నగేష్, 6వ వార్డు కౌన్సిలర్ కౌకుంట్ల అనంతరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు జలాల్ పాషాను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధుగౌడ్, ఉద్దమర్రి ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, వాసవి శ్రీనివాస్‌రావు, అంజలి సురేందర్‌రెడ్డి, పావని జైపాల్‌రెడ్డి, అరుణ యాదగిరి, శ్వేత శ్రీశైలం, నాగరత్న రమణ, జ్యోతి తిరుపతి, పావని పాపా తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఐదేళ్ల పాలన



తల్లిదండ్రులను సన్మానిస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తనకు కుటుంబ సభ్యులు అందించిన సహకారం మరువలేనిదని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు తన తల్లిదండ్రులతోపాటు సోదరులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై చైర్మన్ కావడానికి తన తండ్రి మల్లారెడ్డి రాజకీయ జీవితం స్ఫూర్తి కాగా ఆర్థికంగా అన్న సత్తిరెడ్డి ఆదుకోవడం మరువలేనిదన్నారు. తమ్ముడు రాజేశ్వర్‌రెడ్డి వ్యాపారం కోసం ఎంత సమయం కేటాయించాడో అంతకంటే ఎక్కువ సమయం తనవెంటే గడిపాడని చెప్పారు. ఐదేళ్ల పాలనతో కుటుంబ సభ్యులను సైతం పట్టించుకోలేదని, ఎక్కువ సమయం ప్రజాశ్రేయస్సుకే కేటాయించానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దౌల్తాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులు, రికార్డులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయనవెంట తహసీల్దార్ గాయత్రి, ప్రధానోపాధ్యాయుడు శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

దోమ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు సూచించారు. మండలంలోని బాసుపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ప్రారంభానికి సిద్ధంగా సహకార గోదాం



గోదాం ఆవరణలో పనులను పరిశీలిస్తున్న రవీందర్‌గౌడ్

తాండూరు రూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం ఎల్మకన్నె సహకార సంఘం గోదాం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు) ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం జేసీబీతో గోదాం వద్ద చదును చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నాబార్డు ద్వారా రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు ఎల్మకన్నె సహకార సంఘానికి రూ.1 కోటి 18 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో మండల పరిధిలోని అల్లాపూర్ శివారులో ఎకరా 30గుంటల్లో నిర్మాణం పూర్తయిందని, ఫిబ్రవరి 3న తాండూరు ప్రారంభిస్తారని తెలిపారు. గోదాం ప్రారంభమైతే మండల పరిధిలోని 38 గ్రామాలకు చెందిన రైతుల ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



వికారాబాద్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ రాఘవీణా

వికారాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణా పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వాడడం వల్ల జీవితాలు పాడవుతాయన్నారు. తల్లిదండ్రులు ఆకాంక్షలకు అనుగుణంగా మంచిగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పరిగి ఎక్సైజ్ సీఐ నీరజదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం గురించి తెలిస్తే సమాచారం అందించాలన్నారు.

తాండూరు: ఎక్సైజ్ హెచ్‌ఓ బాలగంగాధర్ వేదిక్ వశిష్ఠ హై స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలు వాడితే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నిజాముద్దీన్, హైస్కూల్ కరస్పాండెంట్ సుభాష్, ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థికి అవార్డు



శ్రీథార్థ్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న జూబ్లీహిల్స్ పాఠశాల నిర్వాహకులు

కీసర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థికి జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. గత నెల 17వ తేదీన జాతీయ స్థాయిలో ఢిల్లీకి చెందిన బ్రెయిన్ ఫీడ్ ఎంఐ ఛాప్స్ సంస్థ వారు ఆల్ ఇండియా ఇంగ్లిష్ ఛాలెంజ్ పరీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి శ్రీథార్థ్ అద్వాయ్ ఆరిష్ వెంగలపూడి ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్నాడు. బుధవారం వెలువడిన పరీక్షఫలితాల్లో శ్రీథార్థ్ జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా సంస్థ వారు ల్యాప్‌ట్యాప్‌ను బహుమతిగా అందజేయగా బుధవారం దానిని శ్రీథార్థ్‌కు పాఠశాల నిర్వాహకులు అందజేసి, అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ విద్యుత్ శాఖ ఏడీఈ రాజమల్లేష్ తెలిపారు. తమ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో సమావేశం నిర్వహించి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో లోడ్ తగ్గించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లు కరెంట్ సరఫరాకోసం సబ్‌స్టేషన్లను సిద్ధం చేస్తున్నామన్నారు.

బీమా చెక్కు అందజేత

దుద్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బీఆర్ఎస్‌లో బీమా ఉండటంతో మంజూరైన చెక్కును రాజశేఖర్‌రెడ్డి భార్య బిచ్చాల అరుణమ్మకు బీఆర్ఎస్ నాయకులు బుధవారం అందించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల యాదగిరి, మహేందర్ రెడ్డి, మధుసూదన్‌యాదవ్, దేశ్యనాయక్, సలాం, హీర్యానాయక్, రాముగౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

కొడంగల్: కొడంగల్ పట్టణంలోని ముదిరాజ్ భవనంలో బుధవారం ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు తలారి శేఖర్ ఆధ్వర్యంలో దుద్యాల మండల అధ్యక్షుడిగా రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, శేఖర్, సాయిలు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

కొడంగల్: కొడంగల్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొంటారని కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు.

సంక్షిప్తంగా..

వైద్య శిబిరానికి స్పందన

కులకచర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల కేంద్రంలోని రామలింగేశ్వర కళాశాలలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య నిపుణులు వెంకట కామేశ్వరి, అపర్ణలు శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వాజీయొద్దీన్, ప్రిన్సిపాల కామేశ్వరి, ఎంఈవో హబీబ్ అహ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పూడూరు: తమ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని చెన్‌గోముల్ పరిధిలోని సర్వేనంబర్-496లో 10.22 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన నూర్జహాన్‌కు ఎకరం, ఇమ్రాన్ ఖాన్‌కు ఎకరం, గఫార్‌కు ఎకరాల 22గుంటలు, మాల్ల అంజయ్యకు మూడెకరాలు, మాల్ల బుచ్చమ్మకు మూడెకరాలు, మాల మల్లేశానికి ఎకరా పొలం ఉంది. ఈ భూమిని తమకు తెలియకుండా హైదరాబాద్‌కు చెందిన మొహ్మద్ అబ్దుల్ బాసిత్ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు మాచర్ల గగన్‌రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు. ఈ విషయం గురించి పూడూరు తహసీల్దార్‌ను రైతులు అడుగగా రిజిస్ట్రేషన్ సమయంలో సెలవులో ఉన్నానని సమాధానం ఇచ్చారని తెలిపారు. తర్వాత డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీయడంతో ఈ భూమి విషయంలో తప్పు జరిగిందని, తిరిగి యాదావిధిగా రైతులపై రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పి తమ వారసుల పేర్లపై చేశారన్నారు. అయితే మాచర్ల గగన్‌రెడ్డి తన ఆధార్ కార్డు ఫోర్జరీ చేసి, తన ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ రైతులపై చెన్‌గోముల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ సంఘం కార్యదర్శిగా కుమార్

చౌడాపూర్: అంబేడ్కర్ సంఘం చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శిగా కోస్గి కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో చేపట్టే లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకుసాగాలి

తాండూరు రూరల్: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తాండూరు ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఐనెల్లి శివారులోని తెలంగాణ స్టేట్ సర్వశిక్షా అభియాన్ కస్తూర్బా బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆశలత, సీఆర్టీలు, పీజీసీఆర్టీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బొంరాస్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరుకు బొంరాస్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని ఎంపిక చేయడం హర్షనీయమని గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహా, మాజీ సర్పంచ్ బాబయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రాజు, శివ, రాములు, సురేశ్ పాల్గొన్నారు.



పెద్దేముల్: బోనాలతో బయలుదేరిన మహిళలు

బోనమెత్తిన తింసన్‌పల్లి

పెద్దేముల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మైసమ్మతల్లికి తింసన్‌పల్లి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పెద్దేముల్ మండలం తింసన్‌పల్లి గ్రామంలో ఈనెల 31న ఊరడమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మైసమ్మకు బోనాల పండగ జరిపారు. పిండివంటలు చేసి మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గురువారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉంటుందని, శుక్రవారం ఊరడమ్మ జాతర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మల్కాపూర్‌లో..

తాండూరు రూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్‌లో ఈనెల 24న ప్రారంభమైన గ్రామదేవతల ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం ఊరడమ్మకు మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఏర్పులమ్మ భవిష్యవాణి వినిపించారు. పోతురాజుల విన్యాసం ఆకట్టుకుంది. గ్రామంలో పాడిపంటలు సంవృద్ధిగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. మండల పరిధిలోని ఐనెల్లి గ్రామంలో ఊరడమ్మకు బోనాలు సమర్పించారు.

ది క్రీక్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించలేదని విద్యార్థిని క్లాస్ రూమ్ బయట నిలబెట్టిన ది క్రీక్ ఇంటర్‌నేషనల్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం తీరును నిరసిస్తూ బుధవారం నిరసన చేపట్టారు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న సూర్యాన్షన్ సింగ్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు క్లాస్ రూమ్ బయట కూర్చోబెట్టడం ఏంటని ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవటంతోపాటు గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్ రావు, మనీష్, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయవాది జిలాని

తాండూరు రూరల్, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్యానెల్ న్యాయవాదులు జిలాని, వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం తాండూరు మండల పరిధిలోని ఖాంజాపూర్ తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నారు. పోక్సో యాక్ట్, ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోర్టు సిబ్బంది ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

మోమిన్‌పేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని ఉపాధిహామీ ఉద్యోగులు వాపోయారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మీకి వినతిపత్రం అందించారు. వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు పే స్కేల్ అందిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో శంకరయ్య, ఈసీ వికాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్ బదిలీ

యాలాల, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్ బదిలీ అయ్యారు. కొన్ని సంవత్సరాలుగా మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనను దుద్యాల మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

టీజీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం టీజీయూఎస్ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్యానాయక్, రవికుమార్ అన్నారు. బుధవారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01 పాఠశాలలో ఎంఈవో గోపాల్‌తో కలిసి క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్,టిజియూఎస్ రాష్ట్ర కార్యదర్శి కంల్యనాయక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్, పరిగి మండల అధ్యక్ష, కార్యదర్శులు రఘు, హరిశ్చంద్ర పాల్గొన్నారు.

పెద్దేముల్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్, ఎంఈవో నర్సింగ్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, ప్రధానకార్యదర్శి రవికుమార్, గౌరవ అధ్యక్షుడు గోబ్ర్యానాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంల్యానాయక్, మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న రూపురేఖలు!

(5వ పేజీ తరువాయి)

పనుల పర్యవేక్షణను నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి అప్పగించారు. దీనికితోడు తరచూ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పనుల ప్రారంభానికి చర్యలు

ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో కొడంగల్‌కు రూ.337.44 కోట్లు, కోస్గికి రూ.353.34 కోట్లు మంజూరు చేయడంతో టెండర్లు తుది దశలో ఉన్నాయి. రెండు మున్సిపాలిటీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీరు, వాటర్ ట్యాంకులు, పైపులైన్‌ల కోసం సుందరీకరణ చేపట్టనున్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బీజాపూర్-హైదరాబాద్, మహబూబ్‌నగర్-చించోలిని కలిపే అంబేద్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తాతోపాటు పలు ప్రధాన చౌరస్తాల విస్తరణతో సుందరీకరించనున్నారు. కోస్గి మున్సిపల్‌లోని శివాజీ చౌరస్తా, రామాలయం చౌరస్తా తదితర చౌరస్తాలను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు హెచ్ఎండీఏ పరిధిలో టెండర్‌లు పూర్తి కాగా పనులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన చౌరస్తాల సుందరీకరణతో కొడంగల్, కోస్గి చౌరస్తాల రూపురేఖలు మారే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని 8 మండలాల్లోని వివిధ గ్రామాలను కలిపే రోడ్లను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చెందనున్నాయి. అందులో అంగడిరైచూర్ గేటు నుంచి రుద్రారం, పోలెపల్లి నుంచి పెద్దనందిగామ మీదుగా దౌల్తాబాద్, లింగన్‌పల్లి గేటు నుంచి చిలుముల్‌మైలారం గ్రామాలకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.